## ముగిసిన జాతీయ స్థాయి నాయకత్వ శిబిరం



కిట్స్ కళాశాలలో ఎన్‌సీసీ కెడెట్స్‌తో మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుజూరాబాద్ రూరల్, మే 24: మండలంలోని సింగాపూర్ కిట్స్ కళాశాలలో 12 రోజులుగా 9వ బెటాలియన్ లెఫ్టినెంట్ కమాండింగ్ ఆఫీసర్ జీఎల్‌ఏకే జయందర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి నాయకత్వ శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిథిగా కళాశాల కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ హాజరై మాట్లాడారు. సింగాపూర్ కిట్స్‌లో జాతీయ స్థాయి శిక్షణ శిబిరం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కెడెట్స్ ఈ శిబిరంలో నేర్చుకున్న అంశాలను ఉపయోగించుకొని త్రివిధ దళాల్లో ఉద్యోగాలు సాధించి దేశానికి సేవలందించాలని ఆకాంక్షించారు. శిబిరంలో భాగంగా నిర్వహించిన క్రీడల్లో విజయం సాధించిన కెడెట్లకు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అలాగే వివిధ రాష్ట్రాలకు చెందిన కెడెట్లు తమ ప్రాంతాల సంస్కృతిని ప్రతిబింబించేలా నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కిట్స్ డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్, కిట్స్ ఎన్‌సీసీ అధికారి డాక్టర్ రవీందర్‌బాబుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదాన్ని అంతమొందించాలి



సెమినార్‌లో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్ వీరయ్య

తెలంగాణచౌక్, మే 24: దేశంలో ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అంతమొందించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్ వీరయ్య అన్నారు. శనివారం నగరంలోని కామ్రేడ్ సుగుణరావు భవనంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకొని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అధ్యక్షతన 'పహల్గాం ఉగ్రదాడి–అనంతర పరిణామాలు' అంశంపై నిర్వహించిన సెమినార్‌కు ముఖ్య అతిథిగా వీరయ్య హాజరై మాట్లాడారు. ఉగ్రవాదుల అంతు తేల్చామని ప్రధాని ప్రకటిస్తున్నా, ఇప్పటి వరకు ఒక్క ఉగ్రవాదిని కూడా పట్టుకోలేదన్నారు. ఉగ్రదాడులను బీజేపీ రాజకీయంగా వాడుకోవాలని చూస్తున్నదని విమర్శించారు. అటవీ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలనే ఉద్దేశంతోనే ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం వేల మంది పోలీసులతో మావోయిస్టులను కాల్చి వేయిస్తున్నదని ఆరోపించారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరుపాలని కోరారు. సెమినార్‌లో నాయకులు వెంకటరెడ్డి, ముకుందరెడ్డి, సత్యం, సంపత్, రమేశ్, తిరుపతినాయక్ పాల్గొన్నారు.

## బస్సులో ప్రయాణికురాలి బంగారం అదృశ్యం

తెలంగాణచౌక్, మే 24: జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో ఓ మహిళా ప్రయాణికురాలు బస్సులో బంగారం పోగొట్టుకున్నది. నగరంలోని పద్మనగర్‌కు చెందిన శారద హైదరాబాద్‌కు వెళ్లేందుకు శనివారం సాయంత్రం బస్టాండ్‌కు వచ్చింది. తనతో తీసుకొచ్చిన మూడు లగేజ్ బ్యాగ్‌లతో హైదరాబాద్ జూబ్లీకి వెళ్లే ఈవీ ఎక్స్‌ప్రెస్ బస్సు ఎక్కింది. టికెట్ తీసుకొనే సమయంలో బ్యాగులో పెట్టుకున్న ఐదు తులాల బంగారం కనబడక పోయేసరికి ఆందోళనతో బస్సు డ్రైవర్‌కు తెలపగా, ఆయన ఏటీఎం సురేశ్ దృష్టికి తీసుకెళ్లాడు. ఉన్నతాధికారుల సూచన మేరకు ఏటీఎం వన్ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. బస్టాండ్‌కు చేరుకున్న పోలీసులు గంట పాటు బస్సులోని ప్రయాణికులను, వారి బ్యాగులను తనిఖీ చేశారు. బంగారం లభించకపోవడంతో బస్సును జూబ్లీకి పంపించారు. ప్రయాణికురాలు శారద ఫిర్యాదు తీసుకొని పోలీస్ కేసు నమోదు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.


నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE



★KNR తీగలగుట్టపల్లిలో KCR బిల్డింగ్ దగ్గర అయోధ్యనగర్‌లో 50 & 30 ఫీట్ల రోడ్లతో 194 చ.గ.ల టు ఫేసింగ్ ప్లాటు అమ్మబడును. సెల్: 96183 37209, 76710 65100.
NTK-330283

WANTED

jobs Apply Now!

★AN Infra DVLP సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్స్ కావలెను. యాదాద్రి సమీపంలో వెంచర్లకు @ రాక్‌టౌన్ కాలనీ, అలకాపురి, L.B.Nagar, హైదరాబాద్. సంప్ర: 9989747788.
NT-325337-All

FINANCE

★Project Finance... MSME, CGTSME, Seed Funding, Private Equity, Venture Capital, Laisoning Services @ KPHB. 7032631468.
NT-350515-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189


# అన్నదాతల అరిగోస

- ఆగని వానలు.. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం రాశులు
- తేమ సాకుతో తూకం వేయని నిర్వాహకులు
- వడ్లను కాపాడుకునేందుకు రైతుల తంటాలు



మల్లాపూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడవకుండా పరదాలు కప్పుతున్న మహిళలు

**అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న అకాల వర్షం రైతులను కలవరపెడుతున్నది. ఓ వైపు మరో నాలుగు రోజులు మోస్తరు, భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతుండడం, మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకంలో జాప్యం జరుగుతుండడంతో రైతాంగం దిక్కుతోచని స్థితిలో బిక్కుబిక్కుమంటున్నది. వాతావరణం ఇలాగే ఉంటే ఇక వడ్లెట్ల అమ్ముకునుడోనని ఆందోళన చెందుతున్నది.**

తిమ్మాపూర్, మే 24: మానకొండూర్ డివిజన్ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు దాదాపు పూర్తయ్యాయి. అయితే ఆలస్యంగా నాట్లు వేసిన రైతులు కోతలు ఇటీవలే ముగిశాయి. మరికొన్ని గ్రామాల్లో పదుల ఎకరాల్లో కోయాల్సి ఉంది. అయితే కోతలు పూర్తయిన రైతులు అమ్ముకునేందుకు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో కుప్పలు పోసి ఉంచారు. వడ్లు పోసిన నాటి నుంచి వారం రోజులుగా ఎడతెరపి లేకుండా రోజూ వర్షం పడుతుండడం, వడ్లు తేమ శాతం ఎక్కువగా వస్తుండడంతో నిర్వాహకులు కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు కేంద్రాల వద్దే పడిగాపులు పడుతున్నారు.

### వడ్లు కాపాడుకునేందుకు తిప్పలు

అల్పపీడన ప్రభావంతో అకాల వర్షాలు పడుతుండడంతో వడ్లను ఆరబెట్టుకునే అవకాశం రైతులకు ఉండడం లేదు. దీంతో ఎలా ఉన్నాయో అలాగే ఉండిపోతున్నాయి. కేంద్రాల్లో పోసిన ధాన్యాన్ని రోజూ సంరక్షించుకునే పనిలో ఉండిపోతున్నారు. పరదాలు కప్పినా కూడా ఒక్కోచోట తడుస్తూనే ఉన్నాయి. పరదాల చుట్టూ నీళ్లు చేరి కుప్పల కిందికి వెళ్తున్నాయి. పక్కకు తీసి పోద్దామన్నా పక్కన కూడా నీళ్లు, తడి ఉండడంతో ఏమీ చేయలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారులు స్పందిస్తేనే నష్ట నివారణ

ప్రస్తుత పరిస్థితుల్లో ధాన్యం తేమ శాతం కావాల్సినంత రాకున్నా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఇంకా వర్షాలు పడే అవకాశం ఉందని, పూర్తిగా తడవని ధాన్యాన్నైనా కొనుగోలు చేసేలా రైస్‌మిల్లర్లకు అధికారులు ఆదేశాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఇలానే వదిలేస్తే పాడైపోయి పూర్తిగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యాన్ని ఎంత కాపాడుకున్నా ఎంతో కొంత తడుస్తున్నదని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేలా ఉత్తర్వులు జారీ చేస్తే రైతులు నష్టపోకుండా ఉండే అవకాశం ఉంది.

## తడిసిన ధాన్యం.. తీరని నష్టం



కోట్లనర్సింహులపల్లిలో వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యం

- నెల దాటినా కేంద్రంలో కొనుగోలు చేయని ఫలితం

గంగాధర, మే 24 : మండలంలో కురుస్తున్న అకాల వర్షం అన్నదాతలకు కడగండ్లు మిగులుస్తున్నది. వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తడిసి మొలకలు వచ్చాయి. మండలంలోని కోట్లనర్సింహులపల్లిలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో వర్షానికి ధాన్యం తడిసి మొలక వచ్చినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తేమ శాతం సరిగా ఉంటేనే ధాన్యం కొనుగోలు చేయడానికి కొర్రీలు పెట్టే నిర్వాహకులు, అధికారులు, మిల్లర్లు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తారా? అని ప్రశ్నిస్తున్నారు.

### సారూ.. మా పరిస్థితి సూడున్రి



అయ్యా రేవంత్ రెడ్డి సారు జెర మా పరిస్థితి సూడున్రి. ఏప్రిల్ 22 తారీకు నాడు అరెకురాల పొలం కోసి వడ్లు తెచ్చి కేంద్రంల పోసిన. మా రైతులను ఎవ్వలు పట్టించుకుంటలేరు. వడ్లు ఎప్పుడు జోకుతరో చెప్పుతలేరు. వడ్లు తడువకుంట మాస్తు కష్టపడ్డం కానీ లాభం లేకుంట అయింది. చెడగొట్టు వానలతోనే మొత్తం వడ్లు తడిసి మొలుకలు అచ్చినయి. సార్లు వడ్లు కొని మమ్ములను ఆదుకోవాలె.

*-గంగాధర లచ్చయ్య, రైతు, కోట్లనర్సింహులపల్లి*

### నెలలు గడిచినా వడ్లు కొంటలేరు



కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చి నెలలు గడుస్తున్నా ధాన్యం కొంటలేరు. నిర్వాహకులు ఆడింది ఆట పాడింది పాటగా నడుస్తున్నది. ఎవ్వల వడ్లు ఎప్పుడు జోగుతరో తెలియడం లేదు. వర్షాలకు ధాన్యం తడిసి మొలకలు వచ్చాయి. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఎలాంటి షరతులు లేకుండా మొలకెత్తిన వడ్లను కొని మద్దతు ధర చెల్లించాలి.

*-ఇరుగురాల రవి, రైతు, కోట్లనర్సింహులపల్లి*

## అక్రమంగా వరదకాలువ మట్టి తరలింపు



ర్యాలపల్లి సమీపంలో వరదకాలువ మట్టిని తరలిస్తుండడంతో ఏర్పడిన గొయ్యి

గంగాధర, మే 24 : మండలంలోని ర్యాలపల్లి గ్రామ శివారులోని వరద కాలువ నుంచి కొందరు అక్రమంగా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వందల ట్రాక్టర్లతో అక్రమంగా తరలిస్తుండడంతో వరదకాలువ ప్రాంతంలో పెద్ద గొయ్యి ఏర్పడింది. అక్రమార్కులు నెలల తరబడి అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్నా సంబంధిత శాఖ అధికారులు ఇటువైపు తొంగి చూడలేదని గ్రామస్తులు ఆరోపించారు. కాగా శనివారం గ్రామస్తులు కొందరు సంబంధిత శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించినట్లు స్థానికులు తెలిపారు. అక్రమంగా మట్టిని తరలించిన వారిపై కేసులు నమోదు చేయించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పిడుగుపాటుకు విద్యుత్ ప్యానెల్ బోర్డు ధ్వంసం

గన్నేరువరం, మే 24: ఖాసీంపేట విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి పిడుగు పడడంతో తెల్లవారుజామున వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పిడుగు పాటుకు విద్యుత్ సబ్ స్టేషన్‌లోని కంట్రోల్ రూమ్‌లో గల ప్యానెల్ బోర్డు ధ్వంసం అయింది. ఘటనా స్థలాన్ని విద్యుత్ శాఖ ఎస్ఈ రమేశ్ బాబు, డీఈ తిరుపతి శనివారం పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వీరి వెంట ఏఈ ఆంజనేయులు, విద్యుత్ శాఖ సిబ్బంది ఉన్నారు.

## మత్తడి వద్ద వంతెన నిర్మాణం చేపట్టాలి

గన్నేరువరం, మే 24 : మండలకేంద్రంలోని చెరువు మత్తడి వద్ద వంతెన నిర్మాణం చేపట్టాలని బీఆర్‌ఎస్ నాయకుడు గూడూరి సురేశ్ అన్నారు. మండలకేంద్రంలోని చెరువు మత్తడిని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మత్తడి రోడ్డు కుంగి ప్రమాదకరంగా మారిందన్నారు. చెరువు పూర్తిస్థాయిలో నిండితే మత్తడి వద్ద రోడ్డు కోతకుగురయ్యే ప్రమాదం ఉందని, వెంటనే అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యూత్ మండలాధ్యక్షుడు బోయిని కుమార్, నాయకులు మెరుగు రాము, ఎండీ నదిం, గుడాల సురేశ్, తిరుపతి, నరహరి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా ట్రాన్స్‌ఫార్మర్ గద్దె నిర్మాణ పనులు

కరీంనగర్ రూరల్, మే 24: చెర్లభూత్కూర్‌లోని తాహెర్ కొండాపూర్ రోడ్డులో ముద్దిరాజ్ భవనం వద్ద తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో జీవాలు విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడుతుండగా, శుక్రవారం గ్రామస్తులు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శనివారం ట్రాన్స్‌ఫార్మర్ గద్దె ఎత్తును పెంచుతూ విద్యుత్ అధికారులు యుద్ధ ప్రతిపాదికన పనులు చేపట్టారు. కాగా, ఇప్పటి వరకు విద్యుత్ షాక్‌తో మృతిచెందిన గొర్రెలకు పరిహారం అందించాలని కురుమ సంఘం యువకులు కోరుతున్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్

గన్నేరువరం, మే 24: మండలంలోని పారువెల్ల గ్రామ శివారులో పేకాటస్థావరంపై శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపు దాడి చేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ గోపతి రవీందర్ తెలిపారు. మరో ముగ్గురు పరారయ్యారని చెప్పారు. పట్టుబడిన వారి నుంచి రూ.25,470 నగదు స్వాధీనం చేసుకొని, తదుపరి చర్యల కోసం గన్నేరువరం పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు.

## ట్రినిటీలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్



జ్యోతి వెలిగించి క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న దాసరి మనోహర్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, మే 24: కరీంనగర్ బొమ్మకల్ బైపాస్‌లోని ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 10కి పైగా బహుళ జాతీయ కంపెనీలతో నిర్వహించిన ఆన్ క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో 212 మంది విద్యార్థులకు పైగా పాల్గొని ఉద్యోగాలు సాధించారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు ట్రినిటీ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ వ్యవస్థాపకుడు దాసరి మనోహర్‌రెడ్డి, కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి ఆయా కంపెనీల తరపున నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేంద్ర సింగ్, ఏవో రాజశేఖర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పి. కిశోర్, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, హెచ్‌వోడీలు బలరాం, శ్రీధర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## గుణాత్మక విద్యనందించాలి



పారమిత పాఠశాల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డీఈవో జనార్ధన్ రావు

కమాన్‌చౌరస్తా/ మానకొండూర్/ హుజూరాబాద్ టౌన్/ చొప్పదండి/ చిగురుమామిడి, మే 24 : ఉపాధ్యాయులంతా బోధన పద్ధతులను మెరుగుపరచుకోవాలని, భాష, నైపుణ్యాలను పెంపొందించుకొని పిల్లలకు గుణాత్మకమైన విద్యను అందించే ప్రయత్నం చేయాలని డీఈవో జనార్ధన్ రావు సూచించారు. నగరంలోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో గంగాధర మండల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. అలాగే మానకొండూర్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు కొనసాగుతున్న వృత్యంతర శిక్షణను పరిశీలించారు. ఆయా చోట్ల మాట్లాడుతూ, ప్రతి ఉపాధ్యాయుడు క్షేత్రస్థాయిలో కృషి చేసి పాఠశాల, విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం తోడ్పడాలని సూచించారు. అలాగే హుజూరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చొప్పదండి ఎమ్మార్సీ, చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్ ఆదర్శ (మోడల్) స్కూల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ శనివారం ముగిసింది. ఆయా కార్యక్రమాల్లో కోర్స్ డైరెక్టర్స్, ఆయా మండలాల ఎంఈవోలు గంగాధర ప్రభాకర్ రావు, భూపతి శ్రీనివాస్, ఎం మధుసూదనాచారి, మోహన్, వీ పావని, మండల రిసోర్స్ పర్సన్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జాగ్రత్తలతోనే విద్యుత్ ప్రమాదాల నియంత్రణ

ముకరంపుర, మే 24: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వినియోగదారులు తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా విద్యుత్ ప్రమాదాలను నియంత్రించవచ్చని కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ ఎం రమేశ్ బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు, గ్రామీణ వినియోగదారులు విద్యుత్ సమస్యలపై తమ పరిధిలోని విద్యుత్ సిబ్బంది, అధికారులను సంప్రదించి వారి సేవలను పొందాలని సూచించారు. విద్యుత్ సమస్యలపై ఎన్పీడీసీఎల్ టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించాలని సూచించారు.

## హుజూరాబాద్ టౌన్ సీఐపై హెచ్‌ఆర్సీలో ఫిర్యాదు

హుజూరాబాద్ టౌన్, మే 24: తన ఫిర్యాదును పట్టించుకోకుండా హుజూరాబాద్ టౌన్ సీఐ టీ కరుణాకర్ ఇబ్బందుల పాలు చేస్తున్నాడని ఆరోపిస్తూ హైదరాబాద్‌లోని మానవ హక్కుల కమిషన్‌లో శనివారం ఫిర్యాదు చేసినట్లు పట్టణానికి చెందిన కొలిపాక రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థల వివాదంలో పట్టణానికి చెందిన ఈ నెల 22న పంజాల సమ్మయ్య, పంజాల సరోజన తన ఇంటికి వచ్చి తిడుతూ దాడికి ప్రయత్నించారని, ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా టౌన్ సీఐ పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. సమ్మయ్యతో పంచాయితీ చేసుకోవాలంటూ పోలీస్ స్టేషన్‌లో తనను నిలబెట్టి ఇబ్బందుల పాలు చేశాడని కొలిపాక రమేశ్ పేర్కొన్నారు. తన హక్కులకు భంగం కలిగించిన సీఐపై చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల కమిషన్‌ను కోరినట్లు తెలిపారు.

## టీటీఎల్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా చెన్నమల్ల చైతన్య

కమాన్‌చౌరస్తా, మే 24: తెలంగాణ టీచర్స్, లెక్చరర్స్ ఫోరం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా తెలంగాణ ఉద్యమ నాయకుడు, తెలుగు ఉపన్యాసకుడు చెన్నమల్ల చైతన్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు టీటీఎల్‌ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాసం రత్నాకర్ పటేల్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి రాజేశ్వర్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రానున్న విద్యా సంవత్సరంలో ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్లకు, యాజమాన్యాలకు నూతన జిల్లా అధ్యక్షుడు అనుసంధానంగా పని చేయాలని సూచించారు. నూతన జిల్లా అధ్యక్షుడు చైతన్య మాట్లాడుతూ, తన ఎన్నికకు కృషి చేసిన మాసం రత్నాకర్, వంగపల్లి రాజేశ్వర్, సముద్రాల లింగారావు, ఊట్కూరి రామచంద్ర రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు నీర్ల సతీశ్, కుందేటి సత్యనారాయణ, బోడ కుంటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యంపై పట్టింపేది?



వీణవంకలో డ్రైనేజీలో పెరిగిన గడ్డిని తొలగిస్తున్న రైతు

వీణవంక, మే 24: మండల కేంద్రంలో బస్టాండ్ నుంచి వీణవంక వాగు వరకు ఉన్న మురుగు కాలువను ఆరు నెలలుగా పూర్తిస్థాయిలో శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారంతో నిండిపోయింది. డ్రైనేజీని కేవలం ఎస్సీ కాలనీ వరకే శుభ్రం చేస్తూ మిగతా దాన్ని వదిలేయడంతో సుమారు 500 మీటర్ల పొడవున కాలువలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాటు గడ్డి పెరిగింది. దీంతో పైనుంచి వచ్చే మురుగు నీరు పొలాల్లోకి వెళ్తున్నదని స్థానిక రైతు దాసారపు కృష్ణ చైతన్య తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీలో అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకుంటలేరని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని మరికొన్ని డ్రైనేజీల పరిస్థితి కూడా ఇలాగే ఉందని, వెంటనే ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మే 24: నగరంతో పాటు రూరల్ ప్రాంతాల్లో ఇంటర్ లింకింగ్ లైన్, డీటీఆర్, ఇతర మరమ్మతులు చేపడుతున్నందున ఆదివారం టౌన్‌లోని పలు ప్రాంతాలతో పాటు కరీంనగర్ రూరల్‌లోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని కరీంనగర్ టౌన్–1, 2, కరీంనగర్ రూరల్ ఏడీఈలు పీ శ్రీనివాస్, లావణ్య, రఘు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. మధ్యాహ్నం 2నుంచి 4గంటల వరకు ఫారెస్ట్ ఆఫీస్, జైల్ పెట్రోల్ పంప్, సీపీ ఆఫీసు, కరీంనగర్ క్లబ్, వెంకటేశ్వర టెంపుల్ ప్రాంతాలు, ఉదయం 9 నుంచి10 గంటల వరకు ఐబీ చౌరస్తా, సర్కస్ గ్రౌండ్, సెవెన్ హిల్స్, ఓల్డ్ డీఐజీ బంగ్లా, వాటర్ ట్యాంక్ ఏరియా, చెన్నయ్ షాపింగ్ మాల్ ఎదురుగా ఉన్న ప్రాంతం, శ్రీలత టవర్ ఏరియాలు, ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ముగ్దుంపూర్, ఇరుకుల్ల, నల్లగుంటపల్లె, చెర్ల భూత్కూర్, చామనపల్లి, దుబ్బపల్లి, ఫకీర్ పేట్, జూబ్లీ నగర్, బహదూర్ ఖాన్ పేట్, తాహెర్ కొండాపూర్, ఎలబోతారం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## నూతన నియామకం

కలెక్టరేట్, మే 24: తెలంగాణ మైనార్టీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడిగా మహ్మద్ రఫీయొద్దీన్ ఎన్నికయ్యారు. శనివారం నగరంలోని కశ్మీర్‌గడ్డలో గల ఆసంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా ఇంతియాజ్, ప్రధాన కార్యదర్శిగా సర్దార్ బల్బీర్ సింగ్, కార్యవర్గ ప్రతినిధులుగా ఏసోబు, రహీమొద్దీన్, సాదిక్‌ను నియమించినట్లు సంఘం ఉత్తర తెలంగాణ కన్వీనర్ ఎండీ.రాజమహ్మద్ తెలిపారు.

## నీరా కేఫ్ లీజుకు పేర్లు నమోదు చేసుకోవాలి

కలెక్టరేట్, మే 24: జిల్లాలో ఏర్పాటు చేయనున్న నీరా ప్రాసెసింగ్ యూనిట్లు, నీరా కేఫ్‌లు, వాణిజ్య సముదాయాలు, బాంకెట్ హాళ్ల లీజుకు తీసుకునే గీత కార్మికులు ఈనెల 25 సాయంత్రం 3 గంటల్లోగా పేర్లు నమోదు చేసుకోవాలని, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి కె.అనిల్ ప్రకాశ్ తెలిపారు. www.tqttcfc.com, tqobmms.cgg.gov.in అనే వెబ్‌సైట్‌లలో పూర్తి వివరాలు అప్‌లోడ్ చేసుకోవాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

## గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

హుజూరాబాద్ రూరల్, మే 24: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు బాలగోని రాములు శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో ముందుగా హుజూరాబాద్ ప్రభుత్వ హాస్పిటల్‌కు, మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. రెక్కాడితే గానీ డొక్కాడని రాములు కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గీత కార్మిక సంఘం నాయకులు, గ్రామస్తులు కోరుతున్నారు.

## ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్ రూరల్, మే24: తెలంగాణ సాంఘిక గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్, డిగ్రీ చదువుకొని ఉద్యోగం పొందలేని పూర్వ విద్యార్థుల్లో ఉపాధి నైపుణ్యాలను పెంచే లక్ష్యంతో ఉన్నతి ఫౌండేషన్ సంస్థ ఉచిత శిక్షణ ఇస్తున్నదని నగునూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. మాలతి ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 25 సంవత్సరాల్లోపు పూర్వ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు ఈ నెల 30లోగా సెల్ నంబర్ 7995010675 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

## నేత్రదానంతో మరో ఇద్దరి జీవితాల్లో వెలుగు

హుజూరాబాద్ టౌన్, మే 24: హుజూరాబాద్ మున్సిపల్ పరిధి దమ్మక్క పేట గ్రామానికి చెందిన గృహిణి మౌనిక మరణానంతరం నేత్రదానంతో మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపింది. వివరాల్లోకి వెళ్తే.. మౌనిక (32) అనారోగ్యంతో శుక్రవారం మరణించగా, ఆమె భర్త నాగరాజు సమాజ హితం కోరి, నేత్రదానం చేయడానికి అంగీకరించారు. దీంతో తెలంగాణ నేత్ర, శరీర అవయవ దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల, ఎల్వీ ప్రసాద్ నేత్ర సేకరణ టెక్నీషియన్ లక్ష్మణ్ శనివారం మౌనిక కార్నియాను సేకరించి, కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తాటిపల్లి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ఇంతటి దుఃఖంలోనూ నేత్రదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. నేత్రదానానికి దాతలు 99080 88011, 8790548706 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

## జీలుగ విత్తనాల కోసం రైతుల పడిగాపులు



తీగలగుట్టపల్లి డీసీఎంఎస్ వద్ద జీలుగ విత్తనాల కోసం నిరీక్షిస్తున్న రైతులు

కరీంనగర్ రూరల్, మే 24: జీలుగ విత్తనాలు సరిపడా అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం నగునూర్‌లోని జీలుగ విత్తనాల విక్రయ దుకాణంతోపాటు తీగలగుట్టపల్లి గ్రామంలోని డీసీఎంఎస్ షాపు వద్ద మండలంలోని వివిధ గ్రామాల రైతులు ఉదయం నుంచి పడిగాపులు కాశారు. చివరకు సాయంత్రం 4 వరకు జీలుగ విత్తనాలు 50 క్వింటాళ్ల లోడ్ రావడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, 3 ఎకరాలకు ఒక బస్తానే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎప్పుడూ జీలుగ విత్తనాల కోసం ఇలాంటి పరిస్థితి రాలేదని వాపోయారు.

## రజక సంఘం జిల్లా కార్యదర్శిగా సమ్మయ్య

గన్నేరువరం, మే 24: గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన లింగంపల్లి సమ్మయ్య రజక సంఘం జిల్లా కార్యదర్శిగా నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ శనివారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్, లీగల్ అడ్వైజర్ లింగంపల్లి నాగరాజు, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులకు సమ్మయ్య కృతజ్ఞతలు తెలియజేశారు.

## సేంద్రియ మామిడిపండ్లతోనే ఆరోగ్యం



మామిడిపండ్లు అందుకుంటున్న ఆర్డీవో మహేశ్వర్

కలెక్టరేట్, మే 24 : మార్కెట్‌లో విక్రయిస్తున్న పలు రకాల విషపదార్థాల సమ్మిళితమైన మామిడిపండ్లతో ప్రజలు అనారోగ్యాల బారినపడుతున్నారని, సేంద్రియ మామిడిపండ్లతో ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చని రెవెన్యూ డివిజనల్ అధికారి కె.మహేశ్వర్ అన్నారు. ప్రముఖ ఉద్యానపంట రైతు శ్రీహరి శనివారం ఆయనను కలిసి, సేంద్రియ మామిడి పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, తన మామిడితోటలోని మొదటిపంటను నిరుపేదలు, పారిశుధ్యకార్మికులు, అనాథలు, దివ్యాంగులకు వితరణ చేస్తూ, తనవంతుగా సామాజిక సేవనందించడం అభినందనీయమన్నారు. ఆయన సేవాగుణం ఇతరులకు స్ఫూర్తిదాయకంగా మారుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆర్డీవోకు ఉత్తమరైతు బొప్పు శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు.

## చదువుల తల్లికి చేయూత



అభినయకు నగదు అందజేస్తున్న గజ్జెల అశోక్

రామడుగు, మే 24 : ఇంటర్మీడియట్‌లో 984 మార్కులు సాధించిన కొక్కెరకుంటకు చెందిన గుల్లపల్లి అభినయ ఇంజినీరింగ్ మొదటి ఏడాది చదువు కోసం హెల్పింగ్ హ్యాండ్స్ (ఎన్ఆర్ఐ,యూఎస్ఏ) సహకారంతో శనివారం రూ.10 వేలు అందజేసినట్లు యువజన అవార్డు గ్రహీత, రైజింగ్ సన్ యూత్ అధ్యక్షుడు గజ్జెల అశోక్ తెలిపారు. ఇంజినీరింగ్ విద్యలో భాగంగా మిగిలిన మూడేళ్లకు ఏడాదికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు తౌటు కిషన్‌రెడ్డి, బత్తిని అజయ్, జేరిపోతుల మహేశ్, గజ్జెల నవీన్‌కుమార్, ఎండీ చోటే తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డి సంఘం నగర అధ్యక్షుడిగా అనిల్ రెడ్డి

తెలంగాణచౌక్, మే 24: ఆల్ ఇండియా రెడ్డి సంఘం నగర అధ్యక్షుడిగా అనిల్ రెడ్డి నియామకయ్యారు. ఈ మేరకు సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు.